ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
సోమవారం 22 జనవరి 2024



గుండ్ల సింగారంలోని ఐఎంఎఫ్ఎల్ డిపో

బ్రేకేజ్ దందా



మద్యం బాటిళ్లు పగిలాయంటూ లెక్కలు
అబ్కారి డిపోలో నెలకు రూ.15 లక్షలకు పైగా అక్రమ సంపాదన
డిపోలో ఓ అధికారి అవినీతి బాగోతం
కింది స్థాయి సిబ్బందిపైనా అజమాయిషీ

వరంగల్ సిటీ, జనవరి 21: వరంగల్ జిల్లాకు మద్యం సరఫరా చేస్తున్న ఐఎంఎఫ్ఎల్ డిపోలో అక్రమ బ్రేకేజ్‌తో అక్కడి ఓ అధికారి సంవత్సరానికి కోట్ల రూపాయలు గడిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం సీసాలు పగిలినట్టు (బ్రేకేజ్)నకిలీ మూతలతో లెక్కలు చూపుతూ లక్షల రూపాయలు నొక్కేస్తున్న సంగతి బయటకు పొక్కడంతో సదరు అధికారి కింది స్థాయి సిబ్బందిపై అనుమానంతో వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అక్కడ స్టోర్‌లో పనిచేస్తున్న ఓ ముఖ్యుడితో పాటు ప్రైవేటు వ్యక్తులతో కలిసి అర్ధరాత్రి నకిలీ మూతలను మారుస్తూ అక్రమ బ్రేకేజీలకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నట్టు జోరుగా చర్చ జరుగుతోంది.

ఓ అధికారి అక్రమాలు..

అక్కడంతా ఆ అధికారిదే పెత్తనం. సదరు అధికారి ఏం చేసినా ఎవ్వరూ అడగొద్దు. అడిగారో వారిని అటెండర్ కంటే చీప్‌గా చూస్తారు. ఆ అధికారి అక్రమాలు చేస్తూ భారీగానే సంపాదిస్తున్నట్లు తెలుస్తోంది. మద్యం సీసాలు స్వల్పం పగిలితే దాని వివరాలను ఫామ్-1లో నమోదు చేస్తారు. అదే పూర్తిగా పగిలి మద్యం చుక్క కూడా దక్కని పక్షంలో ఆ బ్రేకేజ్ వివరాలను ఫామ్-2లో నమోదు చేస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకుని అక్రమంగా బ్రేకేజ్ అంటూ ఫామ్-2లో పేర్కొంటూ నెలకు సుమారుగా రూ. 15లక్షలకు పైగా కేవలం బ్రేకేజ్‌ల పేరిట నకిలీ నెక్ (మూతలను)లను అమరుస్తూ దండుకుంటున్నట్లు తెలుస్తోంది. డిపోలో ప్రతీ రోజు వచ్చి వెళ్లే వాహనాలకు ఒక్కో వాహనానికి రూ.500 వసూల్ చేస్తున్నట్లు ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. ఇవే కాక స్కానర్స్ పేరిట నెలకు రూ. 3లక్షలకు పైగానే దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇక డిపోలో పనిచేస్తున్న 89మంది హమాలీల్లో అసలెవరో, నకిలీలెవరో సదరు అధికారికి మాత్రమే తెలుసని, హమాలీల వద్ద నుంచి సైతం డబ్బులు వసూల్ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇదంతా సోర్స్‌లో పనిచేస్తున్న ఓ ముఖ్య అనుచరుడితో కలిసి సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

కింది స్థాయి సిబ్బందిపై వేధింపులు..

గుండ్ల సింగారం ఐఎంఎల్ డిపోలో సదరు అధికారి వేధింపులు కింది స్థాయి సిబ్బందిని మనోవేదనకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. తన తర్వాత అధికారిగా ఉన్న ఓ అధికారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు సమాచారం. తన రూమ్‌ను శుభ్రపరచకుండా, తన వాహనానికి పార్కింగ్ లేకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం.

తెలిసినా పట్టించుకోని ఉన్నతాధికారులు

డిపోలో ఆగడాలు చేస్తూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్న సదరు అధికారి విష యం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలుస్తుంది. అయితే సదరు అధికారికి భయపడి ఎవరూ ఏమి చేయడం లేదనే ప్రచారం సాగుతోంది. తనను ఎవరేం చేయలేరని, డిపో అంతా తన ఇష్టారాజ్యంగానే నడవాలనే హుకూం జారీ చేయడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నట్టు తెలిసింది.





ఆగని రైళ్లు

కరోనా నుంచి ఆగని ఎక్స్‌ప్రెస్‌లు
కొత్త వాటికీ కలగని మోక్షం
ఎక్స్‌ప్రెస్‌గా మారిన ప్యాసింజర్ రైళ్లు..
లక్షల్లో ఆదాయమున్నా పట్టించుకోని రైల్వే శాఖ
సమస్యల వలయంలో నెక్కొండ రైల్వే స్టేషన్

నెక్కొండ, జనవరి 21: జిల్లాలో వరంగల్ తర్వాత ఏకైక పెద్దదైన నెక్కొండ రైల్వేస్టేషన్ సమస్యలకు నిలయంగా మారింది. స్టేషన్‌లో పట్టుమని పది రైళ్లకు కూడా హాల్టింగ్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కరోనాకు ముందు ఐదు ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు ఐదు ప్యాసింజర్ రైళ్లు అప్ అండ్ డౌన్‌లలో ఆగడంతో నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడేది. నెలనెలా రూ.20లక్షల పైనే ఆదాయం వచ్చేది. 2020 మార్చిలో కరోనా ప్రారంభమైన నాటి నుంచి రైళ్ల హాల్టింగ్‌ను రద్దు చేయడంతో పరిసర తొమ్మిది మండలాల్లోని ప్రయాణికులు రైలు సౌకర్యం లేక ఇక్కట్లు పడుతున్నారు. నిత్యం వరంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లే చిరు వ్యాపారులు రైళ్ల రద్దుతో వారి వ్యాపారాలకు దూరమయ్యారు. కరోనా తగ్గినా రైళ్ల హాల్టింగ్‌ను మాత్రం రైల్వే శాఖ ఇంకా ప్రారంభించ లేదు. అయితే రెండు ప్యాసింజర్ రైళ్లు సింగరేణి (భద్రాచలం రోడ్ - బల్లార్ష), కాకతీయ (భద్రాచలం రోడ్ -సికింద్రాబాద్) రైళ్లను ఎక్స్‌ప్రెస్ రైళ్లగా ప్రకటించి పునఃప్రారంభించారు. ఈ రెండు రైళ్లు పేరుకే ఎక్స్‌ప్రెస్‌లు. ప్రతీ స్టేషన్‌లో హాల్టింగ్ ఉండగా ఎంత సమయం ఆగుతాయో.. గమ్యస్థానానికి ఎప్పుడు చేరుతాయో తెలియదు. గతంలో వరంగల్‌కు ప్యాసింజర్ టికెట్ రూ.10 ఉండగా, ఎక్స్ ప్రెస్‌కు రూ.30 ఉంది. దీంతో సామాన్యులకు రైలు ప్రయాణం భారంగా మారింది.

హాల్టింగ్ లేని రైళ్లు..

గతంలో విజయవాడ-కాజీపేట, భద్రాచలం రోడ్డు జంక్షన్‌ల మధ్య నడిచిన నాగపూర్ ప్యాసింజర్, మణుగూర్ ప్యాసింజర్, పెద్దపల్లి ప్యాసింజర్ రైళ్లను అధికారులు నేటికీ పునరుద్ధరించ లేదు. అలాగే, కరోనా తర్వాత పునఃప్రారంభించిన పద్మావతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (సికింద్రాబాద్ - తిరుపతి), గౌతమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (లింగపల్లి-కాకినాడ పోర్టు) డౌన్ రైలు నెక్కొండ స్టేషన్‌లో ఆగుతుండగా, అప్ రైలు ఆగడం లేదు. అలాగే లింక్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నిజాముద్దీన్ -విశాఖపట్నం) రైలును కూడా పునరుద్ధరించ లేదు. సాధారణంగా ఒకే పేరుగల రైళ్లకు హాల్టింగ్ ఉన్న స్టేషన్‌లలో అప్ అండ్ డౌన్ హాల్టింగ్ ఉంటుంది. కానీ, ఈ స్టేషన్‌లో గౌతమి, పద్మావతి సూపర్ ఫాస్ట్‌లకు కేవలం డౌన్ రైలు మాత్రమే ఆగుతుండటంతో ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు.

నూతన రైళ్ల హాల్టింగ్ ఎప్పుడో..

గత 15 ఏళ్ల నుంచి ఒక్క కొత్త ఎక్స్‌ప్రెస్ రైలుకు అధికారులు హాల్టింగ్ ఇవ్వలేదు. నర్సంపేట డివిజన్‌లో ఉన్న ఒకే ఒక్క ఈ రైల్వే స్టేషన్ తొమ్మిది మండలాలకు ఏకైక రైలు సౌకర్యం కల్పిస్తోంది. మహబూబా బాద్ పార్లమెంట్ పరిధిలోని నెక్కొండలో రైళ్ల హాల్టింగ్ ఇప్పించాల్సిన ఎంపీ మాలోతు కవిత గత ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి నెక్కొండ వైపు కన్నెత్తి చూడడం లేదని ప్రయాణికులు మండి పడుతున్నారు. శాతవాహన, నవజీవన్, ఇంట ర్ సిటీ, కోల్హాపూర్, మణుగూరు, షిర్డీ, గౌతమి, పద్మావతి (అప్) సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇప్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తెరుచుకోని వెయిటింగ్ హాల్..

ప్రయాణికుల సౌకర్యార్థం స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన వెయిటింగ్ హాల్ తెరవడం లేదు. సిబ్బందిని నియమించకపోవడం, స్టేషన్‌లో ఉన్న సిబ్బంది పని ఒత్తిడిల కారణంగా వెయిటింగ్ హాల్‌ను తెరుచుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే నీటి సరఫరా లేకపోవడంతో ప్లాట్ ఫాం పైన రెండు చోట్ల ఉన్న మరుగు దొడ్లను తెరువడం లేదు.

శిథిలావస్థలో రైల్వే క్వాటర్స్ ...

నెక్కొండ పరిసర రైల్వే స్టేషన్‌లో విధులను నిర్వహించే ఉద్యోగులకు, రైల్వే విద్యుత్ సెక్షన్‌లో విధులను నిర్వహించే ఉద్యోగుల కోసం దాదాపు 50 సంవత్సరాల క్రితం క్వాటర్స్ నిర్మాణం చేశారు. కానీ, ఎలాంటి మరమ్మతులు చేయక పోవడంతో క్వాటర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉద్యోగులు క్వాటర్స్‌లో ఉండటానికి ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే కురుస్తుండటంతో తాత్కాలికంగా ప్లాస్టిక్ కవర్లను ఏర్పాటు చేసుకున్నారు. వాటర్ ట్యాంక్‌ను అధికారులు ఇటీవలే తొలగించారు.

ఎఫ్‌సీఐ గోదాములతో కోట్ల ఆదాయం

నెక్కొండ రైల్వే స్టేషన్‌లో 1.80లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం నిల్వ చేసే 18 గోదాములున్నాయి. గోదాములకు ఏకకాలంలో మూడు గూడ్స్ వ్యాగిన్‌లు వెళ్లి, రావడానికి మూడు రైల్వే ట్రాక్‌లను నిర్మించా రు. ఈ సౌకర్యం సికింద్రాబాద్ డివిజన్‌లో ఒక్క నెక్కొండ రైల్వే స్టేషన్‌లో ఉంది. ఈ స్టేషన్ నుంచి భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు బియ్యం సరఫరా చేస్తుంటారు. దీంతో రైల్వే శాఖకు సంవత్సరానికి కోట్ల రూపాయల ఆదాయం వస్తోంది. 2021- 22లో ఆర్థిక సంవత్సరంలో రూ.42కోట్లు, 2022-23లో రూ. 34 కోట్లు, 2023-23 డిసెంబరు వరకు రూ.31.23 కోట్ల ఆదాయం వచ్చింది.



స్టేషన్ నుంచి బయటికు వస్తున్న ప్రయాణికులు, గోదాముల సముదాయంలోకి ఏర్పాటు చేసిన రైల్‌ట్రాక్‌లు

మూడో ట్రాక్‌తో ఆ దారి బందేనా?

ఈ రైల్వేస్టేషన్ నెక్కొండ గ్రామ మధ్యలో ఉంటుంది. స్టేషన్‌కు ఇరు వైపులా ఇండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు ఉన్నాయి. అయితే నూతనంగా నిర్మాణం చేస్తున్న మూడో రైల్ ట్రాక్ ఏర్పాటుతో పోలీసు స్టేషన్ వైపు దారి లేకుండా పోతోంది. నూతనంగా ఈ స్టేషన్‌లో నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఒకటో నెంబర్ ప్లాట్ ఫామ్ నుంచి రెండో నెంబర్ వరకు నిర్మాణం చేస్తున్నారు. నూతనంగా నిర్మాణం చేస్తున్న మూడో ట్రాక్‌పై నుంచి బ్రిడ్జి నిర్మాణం చేయడం లేదు. దీంతో పోలీసు స్టేషన్ వైపు దారి ఉంటుందా లేదా అనే విషయమై రైల్వే అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని, దారి ఏర్పాటు చేస్తారా లేదా అంటూ ఆందోళన చెందుతున్నారు.



బియ్యపు గింజపై అయోధ్య రామమందిరం

నర్సంపేట టౌన్, జనవరి 21 : అయోధ్యలో రామ మందిర నిర్మాణ ప్రారంభోత్సవ సందర్భంగా నర్సంపేట పట్టణానికి చెందిన మైక్రో ఆర్టిస్టు శ్రీరామోజు జయకుమార్ బియ్యపు గింజపై అయోధ్య రామమందిర రేఖా చిత్రాన్ని చిత్రీకరించి అబ్బురపరిచారు. అంతేకాకుండా బియ్యపు గింజపై పచ్చని వృక్షాన్ని, జై శ్రీరామ్ అనే నామాన్ని హిందీ పదాలతో రాశాడు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ రామయ్యకు తన వంతు ఉడుతా భక్తిగా రెండురోజులపాటు శ్రమించి బియ్యపు గింజపై రామమందిర రేఖా చిత్రాన్ని చిత్రీకరించానన్నారు.


పూజలు చేస్తున్న కొండా కుటుంబ సభ్యులు

అమ్మవారి ఆశీస్సులే అండ

మంత్రి కొండా సురేఖ

గీసుగొండ, జనవరి 21: కోట మైసమ్మతల్లి ఆశీస్సులే తమకు అండగా ఉంటాయని మంత్రి కొండా సురేఖ అన్నారు. మంత్రి అయిన తరువాత మొదటిసారిగా భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, కుమార్తె సుశ్మితపటేల్‌తో కలిసి అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టం వేయించి మొక్కులు చెల్లించుకున్నారు. గంటన్నర పాటు మంత్రి సురేఖ ఆలయంలో ఉండి కుటుంబంతో కలిసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనసూర్య, ఎంపీటీసీ రజితసారంగం, నాయకులు నల్లగొండ రమేష్, బొల్లం శివ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక

వరంగల్ సిటీ, జనవరి 21: రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన 2023-24 వరంగల్ జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్ ఈసారి ఆన్‌లైన్ పద్ధతిలో జరిగింది. జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి ఆదివారం ఫలితాలను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి 236 ఎగ్జిబిట్లు ప్రదర్శించగా ఇందులో రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు 12 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 24, 25 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ కూడా ఆన్‌లైన్ పద్ధతిలోనే ఉంటుందని, వాటికి సంబంధించిన సంసిద్ధత కార్యక్రమాలు ఇప్పటికే మొదలైనట్టు తెలిపారు.

సాంకేతిక, కళల సమ్మిళితంగా..


ప్రసంగిస్తున్న డాక్టర్ సురేష్ కుమార్


ఏజాజ్ ఈవెంట్

విజ్ఞానం, వినోదాన్నిపంచిన టెక్నోజియాన్
ముగిసిన మూడురోజుల వేడుక
తిరుగు ముఖం పట్టిన విద్యార్థులు
చివరిరోజు ఆకట్టుకున్న ఈవెంట్లు
స్ఫూర్తి నింపిన అతిథి ప్రసంగాలు
ఆలోచనలు రేకెత్తించిన వర్క్‌షాపులు
విజేతలకు బహుమతుల ప్రదానం

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు మూడు రోజు ల పాటు ప్రతిష్ఠాత్మకమైన వరంగల్ నిట్ కళాశాలలో అంగరంగ వైభవంగా నిర్వహించిన టెక్నోజియాన్-2024 ఆదివారం ముగిసింది. టెక్నోజియాన్‌లో పాల్గొన్న వివిధ రాష్ట్రాల నిటియన్లు గుండెల నింపుకున్న అనుభూతులు, సరికొత్త ఆవిష్కరణ వల్ల కలిగిన అవగాహనలు, ఆలోచనలతో తిరుగు ముఖంపట్టారు. టెక్నోజియాన్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ అంశాలకు సంబంధించి 40కిపైగా ఈవెంట్లను నిర్వహించారు. వందకుపైగా సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. నిట్ విద్యార్థులతో పాటు నగరంలోని పలు పాఠశాలలకు చెందిన రెండు వందల మందికిపైగా విద్యార్థులు సైతం ఆయా సైన్స్ ఫెయిర్లలో ప్రదర్శించి బహుమతులను గెలుచుకున్న ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈవెంట్లు, ఎగ్జిబిట్లు, స్పాట్ ఈవెంట్లు, వర్క్‌షాపులు, అతిథి ప్రసంగాలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఇటీవలకాలంలో చోటు చేసుకున్న సరికొత్త ఆవిష్కరణలను ఆకళింపు చేసుకునేందుకు, తమకు కలిగిన ఆలోచనలను తోటి విద్యార్థులతో పంచుకునేందుకు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల స్ఫూర్తిదాయక ప్రసంగాలను వినేందుకు టెక్నోజియాన్ వేదికగా నిలిచింది. ఈవెంట్లలో విద్యార్థులు పోటాపోటీగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతులను ప్రదానం చేశారు.

అకట్టుకున్న ప్రసంగాలు, వర్క్‌షాపులు

టెక్నోజియాన్ రెండోరోజు శనివారం రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం చేసిన ప్రసంగం విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపింది. టి-వర్క్ ప్రోటోటైపింగ్, త్రీడీ ప్రింటింగ్‌పై వర్క్‌షాపులు విద్యార్థులను ఎంతగానో ఆకటుకున్నాయి. ఇందులో పాల్గొన్నవారు తయారీరంగానికి సంబంధించి ఒక ప్రపంచాన్ని చూశారు. ప్రఖ్యాత వక్త డాక్టర్ నరసమ్మ మిట్లపల్లి వైజ్ఞానిక ప్రసంగం ప్రేక్షకులను కట్టిపడవేసింది. ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ ఈవెంట్, ఎఫ్‌పీవీ రేసింగ్, ఎస్కేప్ రూమ్ ఈవెంట్లు ఆకటుకున్నాయి. ఇన్నోవేటివ్ స్పియర్ ఎక్స్‌పోకు హాజరైన వారు సృజనాత్మకతలో మునిగిపోయారు. పాఠశాల విద్యార్థులు రూపొందించిన పలు రోబోలతో నిర్వహించిన రోబోటిక్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.

సాంకేతిక, కళల సమ్మేళనం

మూడోరోజు టెక్నోజియాన్‌లో ప్రముఖ ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ టీఎస్ సురేష్‌కుమార్ అతిథి ప్రసంగం హైలైట్‌గా నిలిచింది. మరో ముఖ్య అతిథిగా

మిగతా 8వ పేజీలో..

నెల్లుట్ల సర్పంచ్ దంపతులకు

బంపర్ ఆఫర్

- రాష్ట్రపతి ఎట్‌హోంకు ఆహ్వానం
- 26న రాష్ట్రపతితో కలిసి తేనీటి విందు



చిట్ల స్వరూపారాణి, భూపాల్‌రెడ్డి

లింగాలఘణపురం, జనవరి21: జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల సర్పంచ్ దంపతులు చిట్ల స్వరూపారాణి భూపాల్‌రెడ్డికి అద్భుతమైన అవకాశం వచ్చింది. గ్రామపంచాయతీ కీర్తి పతాకాన్ని ఢిల్లీ గడ్డపై రెపరెపలాడించి 2021-22 ఆర్థిక సంవత్సరానికి నీటి సమృద్ధి విభాగంలో జాతీయ పురస్కారాన్ని అందుకున్న తొమ్మిది నెలల్లోనే తాజాగా రాష్ట్రపతి ఎట్‌హోంకు హాజరయ్యే మరో అవకాశం దక్కింది. 26న గణతంత్ర వేడుకల సందర్భంగా నిర్వహించే ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా ఎట్‌హోం వేడుకలకు రావాలంటూ ఆహ్వానం అందింది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని కేంద్రపంచాయితీరాజ్ విభాగం నుంచి తెలంగాణ పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఆదేశాలు అందాయి. సర్పంచ్ దంపతులకు సంబంధించిన పూర్తి డేటాతో కేంద్ర పంచాయతీ రాజ్ విభాగానికి వెంటనే నామినేషన్ సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో సర్పంచ్ దంపతుల్లో అవధులు లేని ఆనందం నెలకొంది. గతేడాది ఏప్రిల్ 17న వారు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదు గా ఉత్తమసేవలకు సంబంధించి జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకు న్నారు. అంతేగాకుండా గ్రామానికి కేంద్రం అందించిన రూ. కోటి నగదుతో ఊరంతా సీసీ రోడ్లు వేశారు. తాజాగా ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా ఎట్‌హోంకు జాతీయ స్థాయి ప్రముఖుల వరుసల్లో నెల్లుట్ల సర్పంచ్ దంపతులు కూడా ఆసీనులు కానుండటం పట్ల జిల్లా ప్రజలు గర్వంగా భావిస్తున్నారు. జాతీయ స్థాయిలో కేవలం 8 మంది సర్పంచ్‌లకు మాత్రమే ఈ అవకాశం దక్కగా అందులో తెలంగాణ నుంచి నెల్లుట్ల సర్పంచ్‌కు స్థానం లభించడం విశేషం.


బెల్లం బుట్టతో వస్తున్న యువతి

ముందస్తు మొక్కులు

కిటకిటలాడిన మేడారం
తరలివచ్చిన 3లక్షల పైగా భక్తులు
వనదేవతలకు ప్రత్యేక పూజలు


పోటెత్తిన భక్తులు

మేడారం, జనవరి 21: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం ఆదివారం కిక్కిరిసిపోయింది. వనదేవతలను దర్శించుకోవడానికి 3 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు జరగనుండగా ముందస్తుగానే మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగు వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను అందుబాటులోకి తేవడంతో వాగులో నీటి ప్రవాహం లేకున్నప్పటికీ పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం నిలువెత్తు బంగారం (బెల్లం)తో తులాభారం వేయించి గద్దెల వద్దకు చేరుకున్నారు. క్యూలైన్ల ద్వారా వనదేవతలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారె, కొబ్బరికాయలు సమర్పించుకుని చల్లగా చూడాలని తల్లులను వేడుకున్నారు. మేకలు, గొర్రెలు, కోళ్లను పెద్దసంఖ్యలో బలిచ్చారు. భారీగా భక్తుల రాకపోత మేడారం చుట్టుపక్కల పరిసరాలు, అటవీప్రాంతం, విడిది చేసిన ప్రదేశం కిక్కిరిసిపోయింది. భక్తులు ఇక్కడే వంటలు చేసుకుని బంధుమిత్రులతో విందు భోజనాలు ఆరగించారు. సంక్రాంతి సెలవుల సమయంలో మొదలైన భక్తుల రద్దీ క్రమేపీ పెరుగుతోంది. జాతర సమయం దగ్గరపడుతున్న క్రమంలో బుధ, గురు, ఆదివారాలు, సాధారణ సెలవురోజుల్లో భక్తుల సంఖ్య లక్షలకు చేరే అవకాశం ఉంది. ఈమేరకు అధికార యంత్రాంగం సౌకర్యాలను మెరుగుపరచాలని సర్వత్రా కోరుతున్నారు.

గంటపాటు ట్రాఫిక్ జామ్

వనదేవతలను దర్శించుకోవడానికి భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో తెల్లవారుజాము నుంచే మేడారం చేరుకున్నారు. భక్తుల రద్దీని అధికార యంత్రాంగం అంచనా వేయలేకపోయింది. దీంతో ఉదయం కొత్తూరు-జంపన్నవాగు మధ్య ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆదివారం వారాంత సెలవు కావడంతో మహాజాతరకు ముందస్తుగా మొక్కులు చెల్లించడానికి భక్తులు వాహనాల్లో భారీ సంఖ్యలో తరలివ చ్చారు. ఈ క్రమంలో జంపన్నవాగు నుంచి హరితహోటల్ వరకు సుమారు కిలోమీటరున్నర వరకు గంటపాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక పార్కింగ్ స్థలాల్లోకి వాహనాలను తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

మహాజాతరను ఈసారి ప్లాస్టిక్ రహితంగా జరిపించాలని ప్రభుత్వం ప్రణాళిక రచిస్తోంది. ఈనేపథ్యంలో ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో రూపొందించిన జ్యూట్ బ్యాగులను స్థానికంగా పంపిణీ చేస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధంపై ఐటీడీఏ పీవో అంకిత్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బౌద్ధమే సమాజానికి దిక్సూచి

వడ్డెపల్లి, జనవరి 21 : బౌద్ధమే సమాజానికి దిక్సూచి అని ప్రముఖ బౌద్ధ ప్రచారిణి బంతే సద్దా రక్షిత అన్నారు. ఆదివారం హనుమకొండలోని గౌతమ బుద్ధుడి విగ్రహం వద్ద బౌద్ధ ధర్మ ప్రచారంలో భాగంగా బుద్ధ వందనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌పి నాయకులు బొమ్మల్ల అంబేద్కర్, మిద్దెపాక ఎల్లయ్య, చిట్యాల బాబు, ఇమ్మడి కొమురయ్య, ఏనుట్ల రవీందర్, దుర్గం స్వామి, సోమ రాంమూర్తి, కేడల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న రైల్వే కార్మికుల పిల్లలు

రైల్వే కార్మికుల పిల్లలకు క్రీడా పోటీలు

కాజీపేట, జనవరి 21: కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జనవరి 26ను పురస్కరించుకుని రైల్వే క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. ఆదివారం రైల్వే కార్మికుల పిల్లలకు పెయింటింగ్, వ్యాసరచన, క్విజ్, క్రికెట్ పోటీలను నిర్వహించారు. మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి పి.రవీందర్, ఏడీఈ ఎం.భాను ప్రసాద్ హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం రైల్వే స్టేడియంలో ఆర్పీఎఫ్, ఫ్రెండ్స్ 11 టీంల మధ్య జరిగిన పోటీలలో ఆర్పీఎఫ్‌టీం విజయం సాధించింది. మధ్యాహ్నం ఆపరేటింగ్ 1, ఆలేర్ పేవే టీంల మధ్య జరిగిన పోటీలలో ఆపరేటింగ్‌టీం విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం. రాజయ్య, కోశాధికారి జి. రాజేశ్వర్ రావు, ఇనిస్టిట్యూట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

లెనిన్ ఆశయ సాధనకు విద్యార్థులు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 21 : సమసమాజ స్థాపన, పీడిత ప్రజల హక్కుల కోసం కృషి చేసిన మహనీయుడు కామ్రేడ్ లెనిన్ అని, ఆయన ఆశయ సాధనకు విద్యార్థులు ఉద్యమించాలని అఖిల భారత కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్షుడు మారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్‌ఎఫ్‌ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకట్‌రెడ్డి ముందుగా లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లెనిన్ చనిపోయి వందేళ్లు గడుస్తున్నా ఆయనను అనుసరిస్తున్నామంటే ఆయన ఎంత త్యాగవంతుడో అర్థం చేసుకోవచ్చన్నారు. లెనిన్ ఆశయ సాధన కోసం విద్యార్థులు, యువత ముందుండి నడవాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను మార్చడం సిగ్గుచేటని మండిపడ్డారు. అలాగే ప్రజల హక్కులను కాలరాస్తూ పరిపాలన కొనసాగించడం బాధాకరమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను తిప్పికొట్టే విధంగా లెనిన్ స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగించాలని ఆయన వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వంగూరు వెంకటేశ్వర్లు, సామాజికవేత్త మాడిశెట్టి అరుణ్ కుమార్, ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఎం.చంద్రారావు, ప్రజా సంఘాల నాయకులు ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, బాబు, చంద్రశేఖర్, సాంబయ్య, మాదం తిరుపతి, మాలోతు రాజేష్ నాయక్, ఉదయ్ కుమార్, గణేష్, సునీల్‌చారి, రంగస్వామి, సందీప్, రాకేశ్, సతీష్, సురేశ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ వైష్ణవి - ఆర్.సి.పురం
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సినీ ప్లానెట్ - కొంపల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా
గలేరియా - పంజాగుట్ట	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	ఎంజిఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	మిరాజ్ సినిమాస్ - చందానగర్
అట్రియమ్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
ఎస్2 సోమ - మల్లాపూర్	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎం.పి మాల్ - కాచిగూడ	మూవీటైమ్ - అమీర్‌పేట
జిఎస్ఎమ్ - మదీనగూడ	ఎస్.ఎల్.ఎస్ - గచ్చిబౌలి
నెక్లెస్ సత్వ - కవాడిగూడ	టివోలి - సికింద్రాబాద్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్- అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
	జె.పి.సినిమాస్ - చందానగర్

సామాన్యులకు సైతం అందుబాటులో ఇస్రో

▸▸ ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌కుమార్

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సామాన్యులకు సైతం అంతరిక్ష పరిశోధనా కేంద్రం(ఇస్రో) అందుబాటులో ఉందని, ఆసక్తి కలిగిన వారు అంతరిక్ష పరిశోధనల్లో పాల్గొనే అవకాశం ఉందని ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ టీఎన్ సురేష్‌కుమార్ అన్నారు. వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్ ముగింపు రోజైన సోమవారం విద్యార్థులనుద్దేశించి అతిథి ప్రసంగం చేశారు. అంబేద్కర్ లెర్నింగ్ హాల్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. తన లాంటి సాధారణ వ్యక్తి ఇస్రోలో పని చేయగలిగితే మీలాంటి తెలివైన వారు ఎందుకు రాలేరు? అని విద్యార్థులనుద్దేశించి అన్నారు. కేవలం ప్యాకేజీలను మాత్రమే పరిగణలోకి తీసుకోకుండా దేశాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఇస్రో లాంటి పరిశోధనా కార్యకలాపాల్లో పాల్గొనాలన్నారు. నిట్ విద్యార్థులు అంతరిక్ష పరిశోధనా రంగం వైపు కూడా దృష్టి సారించాలని, ఇస్రోలో కీలక భూమిక పోషించాలని పిలుపునిచ్చారు. రియల్ టైమ్(నిజ సమయం) అనుభవాన్ని పొందడానికి ఇస్రో కేంద్రానికి రావాలని ఆహ్వానించారు. సాంకేతిక అభివృద్ధిలో కమ్యూనికేషన్ కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ భూగోళంపై తాను ఇప్పటికే దాదాపు అన్ని దేశాలను తిరిగానని, తాను సందర్శించాల్సిన దేశాలు ఇంకా 25 మాత్రమే మిగిలి ఉన్నాయని, వాటిని రెండేళ్లలో పూర్తి చేస్తానన్నారు. సబ్ మెరైన్ నుంచి అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి శాస్త్రవేత్తనుతానేనన్నారు. కరోనా కాలంలో తాను తన పరిశోధనతో కలిసి రేడియో ధార్మికతలు కరోనానుఏమైనా తగ్గిస్తాయా అన్న అంశంపై పరిశోధనలు చేశామన్నారు.


టెక్నోజియాన్‌లో మాట్లాడుతున్న ఇస్రో రిటైర్డ్ సైంటిస్టు డాక్టర్ సురేష్‌కుమార్

అలాగే ఇస్రోలో ఇంజనీరింగ్ స్రవంతిలోగల అవకాశాల గురించి డాక్టర్ సురేష్‌కుమార్ వివరించారు. భావసారూప్యత కలిగిన వ్యక్తులు ఒక్కటై అంతరిక్ష సాంకేతికతలో స్టార్టప్‌ల ఏర్పాటుగల అవకాశాలనుఅన్వేశించాలన్నారు. అంతరిక్ష పరిశోధన, ఇస్రో భవిష్యత్తులో చేపట్టనున్న ప్రయోగాలు తదితర అంశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు, వెలిబుచ్చిన సందేహాలకు సురేష్‌కుమార్ సమాధానాలు ఇచ్చారు. అనంతరం నిట్ ప్రొఫెసర్లు ఆయనను సత్కరించారు.

జహాజ్..

జహాజ్ ఈవెంట్‌ను కాలేజీ ప్రధాన భవనం ఎదురుగా నీటి కొలనులో నిర్వహించారు. చేతితో తయారు చేసిన రిమోట్ నియంత్రిత పడవ ఇందులో హైలెట్. ఈ పడవ నీళ్లలో ఏర్పాటు చేసిన అడ్డంకులన్నిటినీ అధిగమించి గమ్యస్థానానికి చేరుకునేలా రిమోట్‌తో నడపాలి. ఎవరైతే విజయవంతంగా పడవను నిర్ధిత లక్ష్యానికి చేర్చుతారో వారే విజేత. ఈ స్పాట్ లైట్ ఈవెంట్‌ను ప్రతి సంవత్సరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



ఆకట్టుకున్న జహాజ్

▸▸ స్టాక్ వాతావరణం సృష్టించిన వరంగల్ ట్రేడింగ్ రింగ్

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : టెక్నోజియాన్ చివరి రోజు నిర్వహించిన కొన్ని ఈవెంట్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. జహాజ్, వరంగల్ ట్రేడింగ్ రింగ్ ఇందులో కొన్ని.

వరంగల్ ట్రేడింగ్ రింగ్



సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి రియల్‌టైమ్ స్టాక్ వాతావరణాన్ని ఈ ఈవెంట్ సందర్భంగా సృష్టించారు. ఇందులో పాల్గొనేవారికి వ్యాపారం చేయడానికి ఖాతాలు కూడా ఇచ్చారు. ఇందులో పాల్గొన్నవారు నిజంగా స్టాక్ ఎక్స్ఛేంజ్ కార్యకలాపాల్లోన్న అనుభూతికి లోనయ్యారు. ఎక్కువ డబ్బు సంపాదించినవారిని విజేతలుగా ప్రకటించారు.

మెకానికల్ కిట్ అసెంబ్లీ



ఈ ఈవెంట్‌లో పాల్గొనేవారు మెకానికల్ ఇంజనీరింగ్‌లోని ప్రతీ గేర్, స్క్రూ, విడిభాగాలను అసెంబ్లింగ్ చేయడంలో తమ ప్రతిభను చాటారు. తక్కువ సమయంలో విడిభాగాలను అసెంబ్లింగ్ చేసిన వారికి రివార్డు ఇచ్చారు.

మల్లన్నకు పట్నం భక్తుల పబ్బతి


మల్లన్నకు హారతి ఇస్తున్న అర్చకుడు


మల్లన్న ఆలయ ఆవరణలో భక్తజన సందోహం

▸▸ కొమురవెల్లిలో హోరెత్తిన పట్నంవారం

▸▸ భక్తజనసంద్రంగా ఆలయ పరిసరాలు

▸▸ బోనాలు, పట్నాలతో దండిగా భక్తుల మొక్కులు

చేర్యాల, జనవరి 21: కోరమీసాల కొమురవెల్లి మల్లికార్జున స్వామికి పట్నం భక్తులు పబ్బతి పట్టారు. మది నిండా మల్లన్న నామస్మరణతో పాటు డప్పుచప్పుళ్ల దరువుల నడుమ శివసత్తుల సిగాలు, పూనకాలు, పోతురాజుల చిందులతో కొమురవెల్లి విజయాచల గుట్టలు హోరెత్తాయి. మల్లన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చిన మొదటి వారాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్నంవారాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్ నుంచి సుమారు లక్ష మంది భక్తులు తరలిరావడంతో కొమరవెల్లి జనసంద్రంగా మారింది. శనివారం సాయంత్రం ధూళిదర్శనం చేసుకున్న భక్తులు ఆదివారం దండిగా మొక్కులు తీర్చుకున్నారు. భక్తిప్రపత్తులతో బోనాలు తయారు చేసి నైవేద్యాన్ని నివేదించారు. బస చేసిన ప్రాంతంలో, ఆలయ గంగరేగు చెట్టు ప్రాంతంలో, ముఖ మండపంలో మల్లన్నకు చిలుకపట్నం, నజరు, ముఖమండప పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారిని దర్శించుకుని చీర, సారెలతో ఒడిబియ్యాలు పోశారు. తమ కోరికలు నెరవేర్చమని గంగరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. సంతానం కలిగించాలంటూ మహిళలు వల్లుబండ వద్ద వరం పట్టారు.

ఎల్లమ్మ దేవతకు బోనాలు

స్వామి వారి సహోదరి అయిన ఎల్లమ్మ దేవతకు బోనాలు నివేదించారు. డప్పుచప్పుళ్ల నడుమ సిగాలతో శివమెత్తుతూ ఎల్లమ్మతల్లి నామస్మరణతో గుట్టపైకి ఎక్కి అమ్మవారికి బోనాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు.. బెల్లంపానకం, కల్లును నైవేద్యంగా సమర్పించి తమ పసుపుకుంకుమలు చల్లంగా చూడమని వేడుకున్నారు.

క్యూలైన్లలో పడిగాపులు

భారీగా భక్తులు హాజరవడంతో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. పట్నాల మందిరంలోని క్యూలైన్లు నిండిపోయాయి. గంటల తరబడిగా క్యూలైన్లలో పడిగాపులు కాశారు. ఆలయ ఈవో బాలాజీ, పునరుద్ధరణ కమిటీ సభ్యులు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్ పర్యవేక్షణలో చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

నేడు పట్నం, అగ్నిగుండాలు

ఆలయ తోటబావి ప్రాంగణంలో సోమవారం హైదరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం రచించి అగ్నిగుండాలు దాటనున్నారు. వంటినిండా పసుపు ధరించి భక్తులు పట్నంతొక్కి అగ్నిగుండాలలో చిందేయనున్నారు.

అసెంబ్లీలో ఒక్కరున్నా..
కార్యకర్తల బలం ఉంది

▸▸ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

సుబేదారి, జనవరి 21 : అసెంబ్లీలో సీపీఐ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే ఉన్నా.. బయట లక్షలాది మంది కార్యకర్తల బలం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆదివారం సీపీఐ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లాకార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సాంబశివరావు మాట్లాడుతూ.. పేదలు, కార్మికులు, కష్టజీవుల పక్షాన పోరాడేది కమ్యూనిస్టు లేనని అన్నారు. సమస్యలు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని, కమ్యూనిస్టులను మించిన త్యాగధనులు లేరన్నారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధిస్తామనే విశ్వాసం తనకు ఉందని, లేదంటే పోరాటమే మార్గమని అన్నారు. పేదల హక్కుల కోసం అసెంబ్లీలో, బయట పోరాడుతానన్నారు. కేంద్రంలో దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టుపెట్టిన బీజేపీని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అయన పిలుపునిచ్చారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధంలో భాగంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ సీపీఐ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా 101 మందితో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సీపీఐ ఉమ్మడి వరంగల్ జిల్లాల కార్యదర్శులు కర్రె భిక్షపతి, సీహెచ్. రాజారెడ్డి, బి.విజయసారథి, మేకల రవి, కె.రాజ్‌కుమార్, రాష్ట్ర, జిల్లాల నాయకులు పంజాల రమేష్, మండ సదాలక్ష్మి, మారుపాక అనిల్, ఆదరి శ్రీనివాస్, మద్దెల ఎల్లేష్‌లు సమావేశంలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

▸▸ చికిత్స పొందుతూ భర్త మృతి

కమలాపూర్, జనవరి 21: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంప తులను కారు ఢీ కొట్టడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగా యాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మండలంలోని అంబాల వద్ద జరిగింది.. పోలీసు ఇన్‌స్పెక్టర్ బొలిమల్ల సంజీవ్ తెలిపి న వివరాలు ఇలా ఉన్నాయి.

మంచిర్యాల జిల్లాలోని మందమర్రి మండలంలోని రామకృ ష్ణాపూర్‌కు చెందిన బోయిని రవి(50) తన భార్య లతతో కలసి ద్విచక్ర వాహనంపై హనుమకొండకు బయలు దేరారు. హనుమ కొండలోని వారి బంధువుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆస్పత్రికి వెళ్ళి పరామర్శించారు. అనంతరం మండలంలోని గుండేడు గ్రామంలోని తమ బంధువుల ఇంటికి అదే ద్విచక్రవాహనంపై వస్తుండగా అంబాల గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా అజాగ్రత్తగా, అతి వేగంగా వస్తున్న హనుమకొండకు చెందిన కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో దంపతులిద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో చుట్టు పక్కల వారు సమాచారం ఇవ్వడంతో 108లో దంపతులను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో రవి చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడని తెలిపారు. కాగా, తీవ్రగాయాలైన లత పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైనా వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారని తెలిపారు. కాగా, మృతుడు ఎల్ఐసీ ఏజెంటుగా పని చేస్తున్నారని తెలిపారు. మృతుడి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నారని రవికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


ఆస్పత్రిలో మృతి చెందిన రవి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మడికొండ. జనవరి 21 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం మడికొండలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండ నెహ్రూనగర్ కాలనీకి చెందిన బానోత్ మల్లేష్, బానోత్ యాకూబ్ ఇద్దరూ బైక్‌పై ధర్మసాగర్‌కు వెళ్ళి తిరిగి మడికొండకు వస్తున్నారు. ఈ క్రమంలో మడికొండలోని మా ఫంక్షన్ హాల్ సమీపంలోకి రాగానే మడికొండకు చెందిన జనగాం అరవింద్, ఏదుల రాకేష్ ఇద్దరూ బైక్‌పై వేగంగా వచ్చి బానోత్ మల్లేష్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో నలుగురు కిందపడిపోయారు. ప్రమాదంలో బానోత్ యాకూబ్, బానోత్ మల్లేష్, ఏదుల రాకేష్‌కు తీవ్ర గాయాలు కాగా జనగాం అరవింద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక పోలీసులు గాయపడిన వ్యక్తులను 108లో ఎంజీఎంకు తరలించారు. బైకులను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



గాయపడిన ఏదుల రాకేష్, బానోత్ యాకూబ్

మరిపెడ సంతకు వచ్చి..

▸▸ గుండెపోటుతో రైతు మృతి

▸▸ మృతుడు ఖమ్మం జిల్లా వాసి

మరిపెడ, జనవరి 21 : కూరగాయల అమ్మకానికి మరిపెడ సంతకు వచ్చిన ఓ రైతు గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర విషాదం నింపింది. ఆ రైతు తను పండించిన టమాటలను ఆదివారం ఆటోలో మరిపెడ సంతకు తరలించి వాటిని దించుతుండగా కుప్పకూలాడు. చుట్టుపక్కల వారు గుర్తించి ఆస్పత్రికి తరలించేలోపే కన్నుమూశాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన రమణబోయిన రామస్వామి (56) తన టమాట తోట నుంచి టమాటలను ఆటోలో మరిపెడ సంతకు తీసుకొచ్చారు. వాటిని ఆటో నుంచి దించే క్రమంలో ఆయన గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారం వారం జరిగే మరిపెడ సంతకు ప్రతీ ఆదివారం రమణయ్య పిండిప్రోలు ఊరు నుంచి కూరగాయలను ఆటోలో తీసుకొచ్చి అమ్ముకునేటోడు. ఈ ఆదివారం సైతం కూరగాయలను తెచ్చి అందరూ చూస్తుండగానే రమణయ్య మృత్యు ఒడికి చేరాడని సహచర చిరు వ్యాపారులు తమ కళ్ల ముందే జరిగిన రమణయ్య మృతి ఘటనతో కన్నీటి పర్యంతం చెందారు. కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలుపడంతో మృతదేహాన్ని సొంతూరుకు తరలించారు.


రామస్వామి మృతదేహం

అంతా రామమయం!

▸▸ ఉమ్మడి జిల్లాలో ముస్తాబవుతున్న రామాలయాలు

▸▸ అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో పూజలు

▸▸ ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేందుకు ఏర్పాట్లు

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అయోధ్యలో శ్రీ రామ మందిర ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతున్న నేపథ్యంలో సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా అంతటా పండుగ వాతావరణ నెలకొనబోతున్నది. ప్రతీ ఇల్లు ఓ పూజా మందిరంగా మారనున్నది. ఊరు వాడా జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామాలయాలన్నీ ఇప్పటికే అందంగా ముస్తాబయ్యాయి. వీటితో పాటు ఆంజనేయస్వామి గుళ్లన్నింటినీ ప్రత్యేక పూజల నిర్వహణకు సిద్ధం చేశారు. అయోధ్యలోని శ్రీ రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగే సమయంలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓం పతాకాలతో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

పలు ఆలయాల్లో..

హనుమకొండ చౌరస్తా సమీపంలోని రాగన్న దర్వాజలోని పెద్ద కోవెల, చిన్న కోవెల, రాజ్‌పుత్‌వాడలోని రామాలయం, హనుమకొండ ఏకశిల పార్క్‌ను అనుకొని ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, చేర్యాల మండలం ఆకునూరి రామాలయం, ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాచీన వేణుగోపాల స్వామి ఆలయం, వరంగల్ ఎల్లంబజారులోని సీతా రామచంద్రస్వామి ఆలయం, కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలోని రామాలయం, వరంగల్ కాశిబుగ్గలోని రంగనాథ ఆలయం, వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలోని గుట్టపై ఉన్న గోవిందరాజస్వామి ఆలయం, జనగామ జిల్లా జీడికల్లులోని సుప్రసిద్ధ శ్రీరామ క్షేత్రం(వీరాచల క్షేత్రం), హనుమకొండ మచిలీబజార్‌లోని హనుమదాలయం, వరంగల్ కోటలోని రామాలయం, ధర్మసాగర్ మండలం వేలేరులోని రామాలయం, వరంగల్ శివనగర్‌లోని రామాలయం, హనుమకొండ రెవెన్యూ కాలనీలో రామాలయం, పరిమళ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయం తదితర ఆలయాల్లో సోమవారం అయోధ్య రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సమయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

అక్షింతలు

ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అయోధ్య రామ మందిరం అక్షింతలు అన్ని ఆలయాలకు చేరుకున్నాయి. వాటిని విశ్వహిందూ పరిషత్, బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. వీటిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. సోమవారం అయోధ్యలో రామ మందిరంలో బాలరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ జరిగే సమయంలో తమ ఇళ్లలో కూడా పూజలు నిర్వంచి తాము స్వయంగా తయారు చేసుకున్న అక్షింతల్లో వీటిని కూడా కలిపి తలలపై చల్లుకోనున్నారు. పరస్పరం పంపిణీ చేసుకోనున్నారు. ఆలయాల్లో పూజల సందర్భంగా కూడా వీటిని భక్తులకు పూజారులు అందచేయనున్నారు. పక్షం రోజులుగా అయోధ్య రామ మందిరం అక్షింతల పంపిణీ జరుగుతోంది.

టీవీలలో వీక్షణం

రామ మందిరంలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని టీవీలు, ఇతర మాధ్యమాల్లో ప్రత్యక్షంగా ప్రసారం చేయనున్నారు. దీనితో టీవీల్లో వీక్షించేందుకు భక్తులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతిష్ఠాపన సమయంలో అందరూ ఇళ్లలో టీవీల ముందు కూర్చోనుండగా, ఆరు బయట ప్రదేశాల్లో, ఆలయాల ప్రాంగణాల్లో, పబ్లిక్ పార్కులు, టీవీ షోరూములు, వ్యాపార సంస్థలు, ఆధ్యాత్మిక మందిరాలలో భారీ డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు ప్రశాంతంగా కూర్చొని వీక్షించేందుకు వీలుగా టెంట్లను ఏర్పాటు చేస్తున్నారు. హాజరైన భక్తులకు పంపిణీ చేసేందుకు తీర్థ ప్రసాదాలను కూడా తయారు చేస్తున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా భక్తి గీతాలాపనలు, భజనలు, సంకీర్తలను, నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు. పలువురు భక్తులు పక్షం రోజులుగా భక్తి గీతాల ఆలపన సాధన చేస్తూ శ్రీ రాముడిపై తమకున్న భక్తితత్వాన్ని చాటి చెబుతున్నారు. శ్రీరాముడి ఘట్టాల ప్రదర్శనకు నగరంలోని కొన్ని నృత్య శిక్షణా సంస్థల నిర్వాహకులు తమ వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ప్రత్యేక ప్రదర్శనకు చాలా రోజుల కిందటి నుంచే సన్నాహాలు చేస్తున్నారు.



ఓ సిటీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

వరంగల్‌టౌన్, జనవరి 21: నగరంలోని 19వ డివిజన్ ఓసిటీ కమ్యూనిటీ హాలులో ఆదివారం ఓ సిటీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికలు ఎన్నికల కమిటీ కన్వీనర్ ప్రేమ్ స్వరూప్ ఆధ్వర్యంలో జరిగాయి. రెండేళ్ల పదవీ కాలానికిగాను జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా సోల్లేటి శ్రీధర్, జనరల్ సెక్రెటరీగా దొంతుల సంతోష్, కోశాధికారిగా తోట కరుణాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి ఎన్నికల కమిటీ ధ్రువపత్రాలను జారీ చేసింది.

నూతనంగా ఎన్నికైన ఓసిటీ నూతన కార్యవర్గం →



'బాలల్లో ఆధ్యాత్మిక స్ఫూర్తి ఆనందదాయకం'



విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 21: అయోధ్యలో రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా వరంగల్‌లోని మురుగన్ యాడ్స్ ఆధ్వర్యంలో బాల బాలికల్లో ఆధ్యాత్మిక స్ఫూర్తి నింపడం ఆనందదాయకమని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి గట్టు మహేష్ బాబు అన్నారు. ఆదివారం రామన్నపేటలోని సుశీల్ గార్డెన్‌లో మురుగన్ యాడ్స్ ఆధ్వర్యంలో శ్రీరామ, సీత, హనుమాన్ వేషధారణ పోటీలు చేశారు. వివి ధ వేషధారణల పోటీలలో చిన్నారులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బొడ్ల రవీంద్రనాథ్, జిల్లా అధ్యక్షుడు పుల్లూరి మధు, ఉమ్మడవెల్లి సురేష్, పళని సేవాదళ్ కార్యదర్శి పబ్బ సత్యనారాయణ, గంగిశెట్టి హరినాథ్, అనిల్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం

పోచమ్మమైదాన్, జనవరి 21: సనాతన ధర్మాన్ని ప్రతీ ఒక్కరు కాపాడాలని శివానంద గురు కల్చరల్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ అన్నారు. అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని పైడిపెల్లిలోని గురుధామ్‌లో (సప్తధామ్) ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సుమారు 500లకు పైగా జంటలతో సమిష్టిగా కల్యాణం కన్నుల పండగగా జరిపించారు. శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బండారు సాయి నారాయణ, సోమ రామయ్య, మాదారపు సదాశివుడు, గందె ఉమాశంకర్, రేపాల రాంచందర్, పబ్బతి నరేష్ పాల్గొన్నారు.

'గణతంత్ర దినోత్సవాన్ని అణగారిన ప్రజల విముక్తి దినంగా జరుపుకోవాలి'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దళిత ప్రజా సంఘాల జేఏసీ

నర్సంపేట, జనవరి 21 : భారత గణతంత్ర దినోత్సవాన్ని అణగారిన ప్రజల విముక్తి దినంగా జరుపుకోవాలని దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆదివారం భారత రాజ్యాంగం - ముఖ్యాంశాలపై బీఎస్ రాములు రాసిన పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు ప్రొఫెసర్ గద్ద వెంకటేశ్వర్లు, కల్లెపెల్లి ప్రణయ్‌దీప్‌మాదిగ, గుంటి వీరప్రకాశ్, తడుగుల విజయ్‌లు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా అణగారిన ప్రజల హక్కులు ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా తయారైందన్నారు. భూమికి, మానవునికి రెండు స్వాతంత్ర్య దినోత్సవాలు ఉన్నాయని, అందులో ఒకటి ఆగస్టు 15 బ్రిటీష్ వారి నుంచి దేశ భూమి విడుదలైందన్నారు. ఇక రెండవ స్వాతంత్ర్యం జనవరి 26 భారత గణతంత్ర దినోత్సవం రోజున కోట్లాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు విముక్తి పొంది స్వేచ్ఛ వాయువులను పీల్చుకున్న రోజన్నారు. ప్రజలు గణతంత్ర దినోత్సవ వేడుకలను విముక్తి దినంగా జరుపుకోవాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు కట్ల రాజశేఖర్, ఆరేపల్లి బాబు, కేశపాక అశోక్, సంతోష్, నిరంజన్ కుమార్ పాల్గొన్నారు.

మంగళకరమౌ నీరాక..



- నేడు రామయ్య ప్రాణ ప్రతిష్ఠ సంబరాలు
- ఊరూరా వాడవాడల అన్నదానాలకు ఏర్పాట్లు
- ప్రతీ దేవాలయంలో భజనలు, పూజలు..
- ప్రతీ ఇంటిలో దీపాల వెలిగించాలని సూచనలు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 21: శ్రీరాముడు జన్మించిన అయోధ్యలో నిర్మితమైన భవ్య మందిరంలో పుష్య మాసం ద్వాదశి సోమవారం 22న శ్రీరామచంద్రుడి బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా సంబురాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లాలో కూడా విశేష కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఊరూరా వాడవాడల మహా అన్నదానాలు, ప్రతీ దేవాలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, నామ సంకీర్తన భజనలు, హారతులు సాయంత్రం వేళ ప్రతీ ఇంటిలో దీపాలు వెలిగించాలని రామజన్మ భూమి ట్రస్టు పిలుపునిచ్చి న నేపథ్యంలో ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఊరూరా వాడవాడల అన్నదా నాలు..

అయోధ్య ఆలయంలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా కొనసాగుతున్న వేడుకల్లో భాగంగా వరంగల్ జిల్లాలో విశేష అన్నదానాలను ఏర్పాటు చేశారు. వరంగల్ బట్టల బజార్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద, గీతా భవన్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద, పిన్నవారివీధిలో, రామన్నపేటలో గాంధీ విగ్రహం వద్ద, శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద, బట్టల బజారులో బట్టల వర్తక సంఘం ఆధ్వర్యంలో, కొత్తవాడలోని శ్రీభక్త మార్కండేయ దేవాలయంలో, ప్రతీ దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రతీ దేవాలయంలో భజనలు, పూజలు..

రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతీ దేవాలయంలో ఉదయం ప్రత్యే క పూజలు శ్రీరామ జయరామ జయజయ రామా.. రామ సంకీర్తన భజనలు మధ్యాహ్నం అయోధ్య నుంచి ప్రాణ ప్రతిష్ఠ జరిగే కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి భక్తులు తిలకించేలా ప్రతీ దేవాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల నిర్వహణ బాధ్యత కూడా ఆయా దేవాలయాలే చేపడుతున్నాయి.

ప్రతీ ఇంటిలో దీపాల వెలుగులు..

శ్రీరాముడు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా దీపావళి పండుగలా తలపించేలా ప్రతీ ఇంటిలో ఐదు దీపాలను వెలిగించి రాముడికి హారతిగా చేసి ఇంటింటికి అందజేసి శ్రీరాముడి అక్షింతలను కుటుంబ సభ్యులు అందరూ సిరస్సుపై వేసుకోవాలని శ్రీరామజన్మ భుమి ట్రస్టు సభ్యులు తెలిపారు.

జై శ్రీరాం జెండాలతో ముస్తాబైన నగరం..

అయోధ్య సంబురం వరంగల్ నగరంలో కూడా కొనసాగుతున్నది. నగరంలో పలు ప్రాంతాల్లో ఇంటింటికి శ్రీరాముడి జెండాలను ఏర్పాటు చేశారు. రాముడి ఫ్లెక్సీలను ప్రధాన కూడా ఇళ్లల్లో అలంకరించారు. సోమవారం నగరంలో పలు ప్రాంతాల్లో నగర సంకీర్తన, ఊరేగింపులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడానికి ముస్తాబైంది. ఊరేగింపులో భాగంగా ప్రధాన రహదారులపై ప్రజలకు తీర్థప్రసాద వితరణలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరించిన మంత్రి సురేఖ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ

కరీమాబాద్, జనవరి 21: సామాజిక న్యాయవేదిక రాష్ట్ర క్యాలెండర్‌ను ఆదివారం అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హనుమకొండలోని ఆమె స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కుల సంఘాలు చేస్తున్న ఐక్యవేదిక కాంగ్రెస్ ప్రభుత్వానికి, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ఇచ్చి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఏషబోయిన సాంబయ్య యాదవ్, రాష్ట్ర ప్రధాన సలహాదారులు కొమ్మినేని భూపాల్‌రావ్ పటేల్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు భారతీ, హన్మకొండ జిల్లా అధ్యక్షులు దామెరుప్పల శంకర్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చవినోద్‌కుమార్, హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకోజు పూర్ణచందర్ రావు, రజక సంఘం రాష్ట్ర నాయకులు దొడ్డిపాటిత శేఖర్ పాల్గొన్నారు.

- వరంగల్ కలెక్టరేట్: తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం వరంగల్ జిల్లా కమిటీ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మంత్రి కొండా సురేఖ ఆదివారం ఆవిష్కరించారు. తమ నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నగరబోయిన సారంగం , జిల్లా కార్యదర్శి పరికి మధూకర్, జిల్లా సలహదారు ముక్కెర రామస్వామి, కట్ట స్వామి, కావేటి సారయ్య, గడ్డి రవియాదవ్, చెందు మల్లేశ్, నాంచారి కుమారస్వామి పాల్గొన్నారు.
- శంభునిపేట: నగరంలోని 42వ డివిజన్‌కు చెందిన మహిళలు ఆదివారం మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ నాయకులు దామెరకొండ కర్ణాకర్ ఆధ్వర్యంలో హనుమకొండలోని మంత్రి నివాసంలో కొండా సురేఖను కలిశారు. సంక్షేమ పథకాలు అర్హులైన వారందరు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కానుగంటి పద్మావతి, చిట్ల హేమలత, బక్కి కల్పన, బజ్జూరి రేణుక, అడుప లలిత, బజ్జూరి నిర్మల, చిట్ల సంధ్య, లావణ్య స్వరూప, కేడల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.
- ఏకశిలానగర్: మంత్రి కొండా సురేఖను నేషనల్ మెడికల్ అసోసియేషన్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పులి అనిల్ ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. అసోసియేషన్ లెటర్ ప్యాడ్‌ను ఈ సందర్భంగా మంత్రి ఆవిష్కరించారు. అసోసియేషన్‌కు స్థలం కేటాయించాలని కోరగా కలెక్టర్‌తో మాట్లాడి అసోసియేషన్ భవనానికి సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గుండా రవీందర్, ప్రధాన కార్యదర్శి మైదం రాజు, ఉపాధ్యక్షులు డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ అరుణ్, ఇజ్జిగిరి సురేష్, హరికృష్ణ, రాజు, వలబోజు మోహన్‌రావు ఉన్నారు.



క్యాంపు కార్యాలయంలో సూచనలు చేస్తున్న కొండా మురళీధర్‌రావు

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించిన కొండా

వరంగల్‌టౌన్, జనవరి 21: ఓసిటీలోని వరంగల్ తూర్పు నియోజక వర్గం క్యాంపు కార్యాలయాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సందర్శించారు. ఈసందర్భంగా కొండా మురళీధర్‌రావు ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి వాస్తుకు సంబంధించిన కొన్ని సూచనలు చేసి ఆ పనులు త్వరగా చేపించాలని సూచించారు

'వరంగల్ ఎంపీ టికెట్ కేటాయించండి'



కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొండేటి శ్రీధర్

వరంగల్ సిటీ, జనవరి 21: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కొండేటి శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా తన అనుభవాన్ని, సేవలను గుర్తించి వరంగల్ ఎస్సీ పార్లమెంట్ టికెట్ కేటాయించాలని కోరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న గంట రవికుమార్, నాయకులు

వరంగల్‌టౌన్, జనవరి 21: కాశిబుగ్గ జంక్షన్‌లో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం. రాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌కు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవి కుమార్ హాజరై అంబేద్కర్‌కు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ.. బీజేపీలో ఎస్సీలకు సముచిత గౌరవం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ కోసం కమిటీని నియమించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కార్యక్రమంలో డి.చక్రపాణి, జనార్ధన్, కిషన్, నర్సింగం, సుదర్శన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్

సంగెం, జనవరి 21 : మండలంలో రెండో రోజు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఆదివారం సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు ఓటరు నమోదు ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సాధారణ ఓటరు నమోదుతో పాటు ఎమ్మెల్సీ గ్రాడ్యువేషన్ ఓటర్ల నమోదు సైతం జాగ్రత్తగా చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, సూపర్‌వైజర్ కల్పన, శారద, బాలాజీ, రవి పాల్గొన్నారు.

కలిసి పోరాడేందుకు సిద్ధమైన ఆల్ ట్రేడ్ యూనియన్స్



సమావేశంలో మాట్లాడుతున్న గంగుల దయాకర్

వరంగల్‌టౌన్, జనవరి 21: నరంలోని 21వ డివిజన్ ఎల్బీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో గంగుల దయాకర్ అధ్యక్షతన ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. జిల్లాలోని కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాటం చేసేందుకు తీర్మానం చేసుకున్నాయి.

ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయే జిల్లా వరంగల్, హనుమకొండ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు గంగుల దయాకర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జనవరి 26న వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి బైక్ ర్యాలీ, 30, 31న యాజమన్యాలకు సమ్మె నోటీసులు, ఫిబ్రవరి 8న కార్మిక సంఘాలతో వరంగల్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ముక్కెర వీరస్వామి, గన్నారపు రమేష్, పుల్ల రమేష్, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ సేవలు చిరస్మరణీయం



సభలో లెనిన్‌కు జోహార్లు తెలుపుతున్న నాయకులు

కరీమాబాద్, జనవరి 21: సామ్రాజ్యవాద దేశాల దోపిడి ఉన్నంతవరకు పీడిత ప్రజల పోరాటాల్లో కామ్రేడ్ లెనిన్ స్థిరంగా ఉంటాడని, ఆయన సేవలు చిరస్మరణీయమని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు అన్నారు. ఆదివారం ఫోర్టరోడ్ జన్మభూమి జంక్షన్ ఏరియాలో లెనిన్ శతవర్ధంతి సభ నిర్వహించారు. బాలరాజు మాట్లాడుతూ రష్యాలో పెట్టుబడిదారి దోపిడీకి, లెనిన్ కార్మిక వర్గ నాయకత్వంలో పోరాటాలు నిర్మించి 1917లో విప్లవం తీసుకువచ్చాడని అన్నారు. ఏడు సంవత్సరాల నిరంతర ఉద్యమాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మూలించి 1924 సంవత్సరంలో రష్యాను సోషలిస్టు దేశంగా తీర్చిదిద్దాడన్నారు. మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం హిందూ ఫాసిస్టు విధానాలను అమలు చేస్తూ వ్యక్తిగతమైన మతాచారాలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నగర కార్యదర్శి జన్నారం రాజేందర్, నాయకులు శంకర్, బన్న నర్సింగం, రాజలింగం, అక్బర్, హరిబాబు, వీరన్న, కరుణాకర్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గాయాలు



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న అక్బర్

వరంగల్‌టౌన్, జనవరి 21: నగరంలోని 21వ డివిజన్ భారత్ గ్యాస్ కార్యాలయం సమీపంలో ఆదివారం ఉదయం స్థానిక ంగా ఉండే పిల్లలు ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి. కుక్కల దాడిలో బాలుడు అలీ అక్బర్, అనస్‌లు గాయపడ్డారు. వెంటనే చికిత్స కోసం స్థానికులు ఎంజీఎం తరలించారు.

మంత్రి కొండా సురేఖ సీరియస్

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ) : వరంగల్ ఎల్‌బీనగర్ ఘటనపై మంత్రి కొండా సురేఖ జీడబ్ల్యూఎంసీపై సీరియస్ అయ్యారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను ఆదివారం ఆదేశించారు. కుక్కల నియంత్రణకు మ్యాన్‌పవర్ పెంచుకొని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మంత్రి సురేఖ ఆదేశాలపై స్పందించిన కమిషనర్ రిజ్వాన్ బాషా ఎల్‌బీనగర్‌లో పిల్లలపై దాడి చేసిన కుక్కలను పట్టుకునేందుకు బృందాలను పంపినట్లు తెలిపారు. 2023 జనవరి నుంచి ఇప్పటి వరకు 6వేల కుక్కలకు శస్త్ర చికిత్సలు జరిపినట్లు వివరించారు. మరో ఏబీసీ బర్త్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. నగర వాసులు వేసవిని దృష్టిలో పెట్టుకొని తమ ఇళ్ల వద్ద కుక్కలు నీరు తగే చర్యలు తీసుకోవాలని సూచించారు.

నగరానికి ఒక్కటే డాగ్‌హౌస్

66 డివిజన్లలో కుటుంబ నియంత్రణ జరగని కుక్కలు 46వేలకు పైగానే ఉంటాయని బల్దియా చెబుతోంది. ఒక్కో డివిజన్‌లో 500కు తక్కువ కాకుండా కుక్కలు ఉన్నట్లు అంచనా. కుక్కలు పట్టే వాహనాలు మూడు మాత్రమే ఉన్నాయి. ప్రతిరోజు పట్టే కుక్కలు 15 నుంచి 25 మాత్రమే. నగరంలో హనుమకొండలోని చింతగట్టులో ఒకే ఒక్క డాగ్ హౌస్ ఉంది. ఇక్కడ ప్రతీరోజు 12 కుక్కలకు మాత్రమే కుటుంబ నియంత్రణ జరుపుతున్నారు.

వాస్తవానికి ప్రతీరోజు 50 నుంచి 80 కుక్కల వరకు కుటుంబ నియంత్రణ జరిగితేనే త్వరగా కుక్కల సంఖ్య నగరంలో తక్కువయ్యే అవకాశాలు ఉంటాయి. కానీ నగరంలో ఒకే డాగ్‌హౌస్ ఉండడం వల్ల సాధ్యపడే అవకాశాలు లేవు. ఈ క్రమంలో మరో నాలుగు డాగ్‌హౌస్‌లు, సిబ్బంది, కుక్కలు పట్టే వాహనాల సంఖ్యను పెంచితేనే సమస్య తీవ్రత తగ్గే అవకాశాలు ఉన్నాయి.

కొమ్మాలలో ఎమ్మెల్యే రేవూరి పూజలు



లక్ష్మీనరసింహస్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న రేవూరి దంపతులు

గీసుగొండ, జనవరి 21: కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి కుటుంబ సమేతంగా కలిసి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తమ ఇలువేల్పు అయిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని రేవూరి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, ఎంపీటీసీ గోపాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు ఆకుల రుద్రప్రసాద్, నాయకులు చాడా కొమురారెడ్డి, నాగారపు స్వామి పాల్గొన్నారు.

సాంకేతిక, కళల సమ్మిళితంగా..

(5వ పేజీ తరువాయి)

హాజరైన డాక్టర్ బిజిలీ బాలక్రిష్ణన్ సెషన్ విద్యార్థుల ను కట్టిపడేసింది. స్పాట్‌లైట్ ఈవెంట్లలో జహాజ్ అం దరిని విశేషంగా ఆకట్టుకున్నది. వీఆర్ క్రికెట్ ఈవెంట్ సంప్రదాయ ఆటకు వర్చువల్ ట్విస్టునిచ్చింది. కోడ్‌మేజ్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు కోడింగ్‌లో నైపుణ్యాన్ని పెంచుకునేందుకు వీలుకల్పించింది. సాంకేతికత, వినోదం కలగలిసిన ఈ సమ్మేళనం మొత్తం మీద విద్యార్థులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ట్రెండింగ్ ఫిట్ ఈవెంట్ మార్కెట్ ఔత్సాహికులతో సందడి చేసింది. మెకానికల్, మెటలర్జికల్ ఇంజనీరింగ్ నమూనా ప్రదర్శన రంగంలో అత్యాధునిక పరిణామాలను దర్శింప చేసింది. మేధోపరమైన విజ్ఞానాన్ని పెంపొందించడంలో టెక్నోజియాన్ లక్ష్యాన్ని హైలైట్ చేస్తూ, అలాగే పరిశోధనాపత్రాల ప్రదర్శనలపై దృష్టి సారిస్తూ చివరి రోజు కార్యక్రమం ముగిసింది.

సాంకేతికత, కళల సంగమంగా త్రీడీ ప్రింటింగ్ పిక్సెల్స్ టు పోర్ట్రేయిట్ ఈ టెక్నోజియాన్‌లో అత్యంత ఆసక్తికరమైన అంశంగా నిలిచింది. స్వర్టక్ వాహన ప్రదర్శన మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభకు అద్దం పట్టింది. ఆల్ టేరేయిన్ వాహనం వరంగల్ నిట్ మెకానికల్ విద్యార్థుల నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది.



వరంగల్ రూరల్

ఎస్సారెస్పీ కెనాల్‌లో మృతదేహం



కెనాల్ నీటిలో కనిపిస్తున్న గుర్తు తెలియని మృతదేహం

వర్ధన్నపేట, జనవరి 21 : వర్ధన్నపేట పట్టణ శివారు తాళ్లకుంటతండా సమీపంలో ఉన్న ఎస్సారెస్పీ కెనాల్‌లో ఓ గుర్తు తెలియని మృతదేహం ఆదివారం కనిపించ డంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. నీటిలో తేలి ఆడుతూ కనిపిస్తున్న మృత దేహానికి తల కనిపించడం లేదని, చూడటానికి భయంకరంగా ఉందని తండావాసులు చెబుతున్నారు. కాగా, ఈ శవం నీటి ప్రవాహంలో ముందుకు కొట్టుకపోయింది. నీటిలో తేలి ఉన్న మృత దేహాన్ని సెల్ ఫోన్లలో చిత్రీకరించగా ప్రస్తుతం ఆ వీడియో సామాజిక, సోషల్ మీడియాల్లో వైరల్‌గా మారింది. అనుమానాస్పద స్థితిలో కొట్టుకు వచ్చిన మృతదేహం స్థానికంగా కలకలం రేపింది.

మార్మోగుతున్న శ్రీరామనామం



ఇంటి గోడలపై జై శ్రీరామ నామస్మరణ అచ్చు వేస్తున్న బీజేపీ కార్యకర్తలు

నర్సంపేట టౌన్, జనవరి 21 : అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నే జగన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు పట్టణంలోని పురవీధుల్లోని ఇంటి గోడలపై జై శ్రీరామ్ నామస్మరణ అచ్చులు వేశారు. గత కొద్ది రోజులు ఇంటింటికి శ్రీరాముని పూజిత అక్షింతల వితరణ కార్యక్రమాన్ని బీజేపీ కార్యకర్తలు విస్తృతంగా చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదిన పట్టణంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం, ప్రసాద వితరణ ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీరాముని కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకుడు గూడూరు సందీప్, తదితరులు పాల్గొన్నారు.

• ఆలయాలను శుభ్రం చేసిన యువకులు

పర్వతగిరి : అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆదివారం మండలంలోని కల్లెడ గ్రామ రామమందిరంలో గ్రామానికి చెందిన ఇరువురు యువకులు ఆలయాన్ని శుభ్రం చేశారు. గ్రామానికి చెందిన ముదురకోల ప్రసాద్, పెండ్యాల కృష్ణవంశీలు రామాలయంతో పాటు బొడ్రాయి, పోతరాజు ఆలయం, పెద్దమ్మతల్లి ఆలయం, కంఠమహేశ్వరస్వామి దేవాలయం తదితర ఆలయాలను శుభ్రం చేశారు. ఆలయాల్లో, ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి పూజలు నిర్వహించారు. కాగా, రామవిగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండల కేంద్రంలోని రామాలయంలో సోమవారం సీతారాముల కళ్యాణం నిర్వహించను న్నట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు పర్వతగిరి బాధ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు.

• రామభక్తిని చాటిన విద్యార్థులు

నర్సంపేట: పట్టణంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో అయోధ్యలో జనవరి 22న జరిగే బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి సంఘీభావంగా ఆదివారం పాఠశాల హాస్టల్ విద్యార్థులు తమ రామభక్తిని చాటుకున్నారని ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. విద్యార్థులందరూ శ్రీరామ్ ఆకారంలో కూర్చొని, జై శ్రీరామ్ అంటూ నినాదించారని, కార్యక్రమంలో ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారన్నారు.

• మద్యం ముట్టం.. మాంసహారానికి దూరం

నెక్కొండ : అయోధ్య నగరంలో ఈ నెల 22న శ్రీరామ విగ్రహం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మద్యం, మాంసహారానికి దూరంగా ఉంటామంటూ మండలంలోని పనికర గ్రామస్థులు ఆదివారం ప్రతిజ్ఞ చేశారు. విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలో మద్యం అమ్మకాలు, మాంసహారం విక్రయ షాపులను మూసివేయాలంటూ డప్పు చాటింపు చేశారు. గ్రామస్థులు ఎవరూ మద్యం సేవించవద్దని, మాంసాహర విక్రయాలు జరపవద్దంటూ తీర్మానం చేశారు. గ్రామంలోని రామాలయంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని, గ్రామస్థులు అందరు పాల్గొనాల్సిందిగా సర్పంచ్ పింగిలి విజయామోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ గోవర్ధన మాదయ్య వార్డు సభ్యులు తెలిపారు.

• అమీన్‌పేటలో అక్షింతల పంపిణీ

మండలంలోని అమీన్‌పేట గ్రామంలో గ్రామ సర్పంచ్ గరికపాటి హన్మంతరావు నేతృత్వంలో రామ భక్తులు ఆదివారం ఇంటింటికి అయోధ్య అక్షింతలను, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కంకర రోడ్డు ఇంకెన్నాళ్లూ...?

• దట్టంగా వ్యాపిస్తున్న దుమ్ము, ధూళి

• ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



సాయిరెడ్డిపల్లి - రెడ్లవాడ మధ్య కంకర రోడ్డుపై దుమ్ము

నెక్కొండ, జనవరి 21 : నెక్కొండ మండలంలోని సాయిరెడ్డిపల్లి-రెడ్లవాడ గ్రామాలమధ్య నూతన బీటీ డబుల్ రోడ్డు నిర్మాణం చేస్తామంటూ ఆరు నెలల క్రితం పాత బీటీ రోడ్డు తొలగించిన కాంట్రాక్టర్ కంకర పోసి వదలివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై కంకర పోసిన కాంట్రాక్టర్ నీటితో క్యూరింగ్ చేయకుండా వదిలేయడంతో వాహనాలు వెళ్లిన సమయంలో దట్టంగా దుమ్ము ధూళి వ్యాపిస్తోంది. దుమ్ము కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించడంలో వాహనచోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులకు ఈ కంకర రోడ్డుపై ప్రయాణం చేయడం సర్కస్ ఫీట్లతో సమానంగా మారింది. కుటుంబ సభ్యులతో వెళ్తున్న సమయంలో ద్విచక్ర వాహనదారులు పలు మార్లు ప్రమాదాలకు గురవుతున్నారు.ఈ ప్రాంతంలో వ్యవసాయ పనులకు వెళ్లాల్సిన రైతులు కాలినడకన కంకరపై నుంచి వెళ్లడం రైలు పట్టాల పక్క నుంచి వెళ్లినప్పుడు కంకరలో ఎలాంటి ఇబ్బంది కలుగుతుందో అలానే ఇబ్బందులు పడాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రజల ఇబ్బందులు గుర్తించి కాంట్రాక్టర్‌లతో వెంటనే ఈ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

• అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందు బీటీ తొలగించారు

మహేందర్, ఆటోడ్రైవర్, సాయిరెడ్డిపల్లి



సాయిరెడ్డిపల్లి-రెడ్లవాడ గ్రామాల మధ్యలో ఉన్న నాలుగు కిలోమిటర్ల దూరం బీటీ రోడ్డును అసెంబ్లీ ఎన్నికలు జరగడానికి మూడు నెలల ముందు తొలగించారు. ఎన్నికలు జరగక ముందే నూతన డబులు రోడ్డు నిర్మా ణం పూర్తిచేస్తామన్న కాంట్రాక్టర్ ఎన్నికలు జరిగి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయలేదు. ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు భయభ్రాంతుకు గురవుతున్నారు. వాహనాలు ప్రమాదాలకు గురికావడమే కాకుండా దెబ్బతింటున్నాయి. రోడ్డు పూర్తి చేయించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

లెనిన్ ఆలోచనలు సజీవం



నర్సంపేటలో లెనిన్ వర్ధంతిని నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

నర్సంపేట, జనవరి 21: మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ ఆలోచనలు సజీవమని, ఆయన ఆశయాలను కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈసంపెల్లి బాబు అన్నారు. నర్సంపేట పట్టణంలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో లెనిన్ వర్ధంతిని నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాబు మాట్లాడుతూ మొట్టమొదటి సోషలిస్టు విప్లవ నిర్మాత లెనిన్ అని కొనియాడారు. లెనిన్ నాయకత్వంలో జరిగిన రష్యా విప్లవం ప్రపంచ చరిత్రపై ప్రభావం పడిందని, అనేక విముక్తి పోరాటాలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోరబోయిన కుమారస్వామి, బాలకృష్ణ, అనిల్, విజయ, స్వప్న, కార్తీక్, ఇందిర, లక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

• ఘనంగా లెనిన్ వర్ధంతి వేడుకలు

దుగ్గొండి: రష్యా కమ్యూనిస్టు యోధుడు, కార్మిక వర్గ మహా నాయకుడు లెనిన్ శత వర్ధంతి వేడుకలను ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో గిర్నిబావిలోని జీఆర్‌బీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించి, మాట్లాడారు. కార్మిక, కర్షక అభ్యున్నతి కోసం పాటుపడిన లెనిన్ అనుసరించిన బాటలోనే మనమందరం పయనించాలన్నారు. వర్గసామాజిక పోరాటాలే సమసమాజ మార్పునకు దోహదమన్నారు. కార్యక్రమంలో మంద రవి, కుసుంబ బాబురావు, నాగెల్లి కొమురయ్య, మహమ్మద్ రాజాసాహెబ్, సుంచు జగదీశ్వర్, సింగతి మల్లికార్జున్, కందికొండ కుమారస్వామి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

• త్రివిక్రమ్‌పై కేసు నమోదు చేయాలి

వర్ధన్నపేట: గుంటూరు కారం సినీమాలో విలన్లకు మహనీయులు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టిన సినీ దర్శకుడు త్రివిక్రమ్‌పై క్రిమినల్ కేసు నమెదు చేయాలని ఎస్ఎఫ్ఐ వర్ధన్నపేట మండల కమిటీ నాయకులు డిమాండ్‌చేశారు. ఆదివారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం రోడ్డుపై ప్లకార్డులు చేతబూని నిరసన ప్రదర్శన నిర్వహించి మాట్లాడారు. ప్రజా జీవితంలో నిజమైన హీరోలుగా కీర్తిపొందిన లెనిన్, మార్క్స్ పేర్లను సినిమాలో విలన్లకు వాడటం సరికాదన్నారు. వెంటనే ఆ మహనీయుల పేర్లు తొలగించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వర్ధన్నపేట మండల కమిటీ నాయకులు నాగరాజు, అభిరామ్, సాయికిరణ్, ప్రవీణ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవాన్ని అణగారిన ప్రజల విముక్తి దినంగా జరుపుకోవాలి

• దళిత ప్రజా సంఘాల జేఏసీ పిలుపు



బీఎస్ రాములు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దళిత ప్రజా సంఘాల జేఏసీ

నర్సంపేట, జనవరి 21 : భారత గణతంత్ర దినోత్సవాన్ని అణగారిన ప్రజల విముక్తి దినంగా జరుపుకోవాలని దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆదివారం భారత రాజ్యాంగం - ముఖ్యాంశాలపై బీఎస్ రాములు రాసిన పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు ప్రొఫెసర్ గద్ద వెంకటేశ్వర్లు, కల్లెపెల్లి ప్రణయ్‌దీప్‌మాదిగ, గుంటి వీరప్రకాశ్, తడుగుల విజయ్‌లు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా అణగారిన ప్రజల హక్కులు ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా తయారైందన్నారు. భూమికి, మానవునికి రెండు స్వాతంత్ర్య దినోత్సవాలు ఉన్నాయని, అందులో ఒకటి ఆగస్టు 15 బ్రిటీష్ వారి నుంచి దేశ భూమి విడుదలైందన్నారు. ఇక రెండవ స్వాతంత్ర్యం జనవరి 26 భారత గణతంత్ర దినోత్సవం రోజున కోట్లాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు విముక్తి పొంది స్వేచ్ఛావాయువులను పీల్చుకున్న రోజన్నారు. ప్రజలు గణతంత్ర దినోత్సవ వేడుకలను విముక్తి దినంగా జరుపుకోవాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు కట్ల రాజశేఖర్, ఆరేపల్లి బాబు, కేశపాక అశోక్, సంతోష్, నిరంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గండ్ర జ్యోతి తిరుమల పాదయాత్రకు మద్దతు



గండ్ర జ్యోతికి ఘన స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు

నల్లబెల్లి, జనవరి 21: నల్లబెల్లి క్రాస్ వద్ద ఆదివారం జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతికి పుష్పగుచ్చంతో మండల బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బానోతు సారంగపాణి మాట్లాడుతూ.. జిల్లా జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి భూపాలపల్లిలో వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని అద్భుతంగా కట్టించారన్నారు. వేంకటేశ్వరస్వామి దేవాలయం పూర్తికావడంతో గండ్ర జ్యోతి మొక్కుకు కట్టుబడి కాలి నడకన తిరుపతికి బయలుదేరారన్నారు. దీంతో నల్లబెల్లి మండలంలోకి గండ్ర జ్యోతి పాదయాత్ర చేరుకోవడంతో మద్దతు తెలిపామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల శ్రీనివాస్, ఊడుగుల సునీత, పాలెపు రాజేశ్వర్‌రావు, బానోతు హరినాథ్, మామిండ్ల మోహన్‌రెడ్డి, గందె శ్రీనివాస్ గుప్తా, కొత్తపల్లి కోటిలింగాచారి, ఊరటి అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాల వికాస వార్షిక మహాసభ

దుగ్గొండి, జనవరి 21 : బాలవికాస 18వ వార్షిక మహాసభను నాచినపల్లిలో ఆదివారం నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా సర్పంచ్ పెండ్యాల మమతరాజు, ఉపసర్పంచ్ జంగా రాజిరెడ్డి, బాలవికాస ప్రతినిధి పుచ్చకాయల కృష్ణారెడ్డి హాజరయ్యారు. తొలుత కార్యదర్శి నివేదికను తప్పెట లక్ష్మీనారాయణ, జమాఖర్చులను కోశాధికారి కన్నెబోయిన చంద్రమౌళి సభలో ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ మహాసభను ఉద్దేశించి బాలవికాస ప్రతినిధి కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి బాటలు వేస్తూ ప్రజల సహకారంతో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనే ఆకాంక్షతో బాలవికాస సంస్థ ఉందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కన్నెబోయిన చంద్రమౌళి, ఉపాధ్యక్షుడిగా బండారి ఉప్పలయ్య, కార్యదర్శిగా ఎర్రెల్లి కిరణ్, సహాయ కార్యదర్శిగా కందగట్ల రఘుపతి, కోశాధికారిగా గుడిపెల్లి మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

యువ జ్యోతి యూత్ నూతన కమిటీ

చెన్నారావుపేట, జనవరి 21 : యువ జ్యోతి యూత్ అసోషియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గద్దల రాజు, గౌరవ అధ్యక్షుడిగా చెరిపల్లి రాజు, ఉపాధ్యక్షుడిగా మాదాసి దేవేందర్, కార్యదర్శిగా వెల్పుల శ్రీకాంత్, సలహాదారుడిగా జన్ను రమేష్, ప్రధాన కార్యదర్శిగా మాదాసి రమేష్, ముఖ్య సలహాదారులుగా జన్ను రమేష్, గుర్రం స్వామి, ప్రచార కార్యదర్శిగా ఎండీ ఫిరోజ్‌లను ఎన్నుకున్నారు.

సాంకేతిక, కళల సమ్మిళితంగా..

(5వ పేజీ తరువాయి)

హాజరైన డాక్టర్ బీజీలీ బాలక్రిష్ణన్ సెషన్ విద్యార్థుల ను కట్టిపడేసింది. స్పాట్ లైట్ ఈవెంట్లలో జహజ్ అం దరిని విశేషంగా ఆకట్టుకున్నది. వీఆర్ క్రికెట్ ఈవెంట్ సంప్రదాయ ఆటకు వర్చువల్ ట్విస్టునిచ్చింది. కోడ్‌మేజ్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు కోడింగ్‌లో నైపుణ్యాన్ని పెంచుకునేందుకు వీలుకల్పించింది. సాంకేతికత, వినోదం కలగలిసిన ఈ సమ్మేళనం మొత్తం మీద విద్యార్థులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ట్రెండింగ్ ఫీట్ ఈవెంట్ మార్కెట్ ఔత్సాహికులతో సందడి చేసింది. మెకానికల్, మెటలర్జికల్ ఇంజనీరింగ్ నమూనా ప్రదర్శన రంగంలో అత్యాధునిక పరిణామాలను దర్శింప చేసింది. మేధోపరమైన విజ్ఞానాన్ని పెంపొందించడంలో టెక్నోజియాన్ లక్ష్యాన్ని హైలైట్ చేస్తూ, అలాగే పరిశోధనాపత్రాల ప్రదర్శనలపై దృష్టి సారిస్తూ చివరి రోజు కార్యక్రమం ముగిసింది. సాంకేతికత, కళల సంగమంగా త్రీడీ ప్రింటింగ్ పిక్సెల్స్ టు పోర్ట్రేయిట్ ఈ టెక్నోజియాన్‌లో అత్యంత ఆసక్తికరమైన అంశంగా నిలిచింది. స్పర్దక్ వాహన ప్రదర్శన మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభకు అద్దం పట్టింది. ఆల్ టెర్రేయిన్ వాహనం వరంగల్ నిట్ మెకానికల్ విద్యార్థుల నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది.

స్కూళ్లకు విద్యుత్ భారం

• నిర్వహణకు ఇబ్బందులు

• ఉచిత విద్యుత్‌తో ఎంతో మేలు



రాంధన్ తండాలోని ప్రభుత్వ పాఠశాల

వర్ధన్నపేట, జనవరి 21 : తమ పార్టీ అధికారంలోకి రాగానే పేదలకు ఉపయోగపడే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ నేతలు హామీలు ఇచ్చారు. అలాగే గృహ అవసరాలకు సైతం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందజేస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ స్కూళ్లకు కూడా ఉచిత విద్యుత్ అందజేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సైతం చదువులు అందాలంటే డిజిటలైజేషన్ అవసరం. అయితే పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తే మరింత వేగంగా ప్రభుత్వ లక్ష్యానికి చేరవయ్యే అవకాశం ఉంటుంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విద్యుత్ కనెక్షన్లున్నాయి. అయితే పాఠశాలలకు సంవత్సరానికి ఒకసారి విడుదలయ్యే నిర్వహణ బిల్లుల నుంచి సగం వరకు విద్యుత్ బిల్లు చెల్లించడానికే సరిపోతుంది. ఇతర ఖర్చులకు డబ్బులు సరిపోకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ ప్రభుత్వమైనా పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తే కొంత ఊరట ఉంటుందని తద్వారా విద్యార్థులకు ఉపయోగపడుతుందని మేధావులు, విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.


• అన్ని పాఠశాలలు డిజిటలైజేషన్

అన్ని ప్రభుత్వ బడుల్లో బోరుబావులు, ఫ్యాన్లు, కంప్యూటర్లతోపాటు ఇతర అవసరాలకు విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. గత సంవత్సరం మన ఊరు, మన బడి పథకంలో భాగంగా పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో కొన్నింటికి మరమ్మతులు సైతం పూర్తి చేశారు. మరమ్మతులు పూర్తయిన పాఠశాలల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో కంప్యూటర్లు, స్కానర్లు, డిజిటల్ బోర్డులను పంపిణీ చేసింది. బ్లాక్‌బోర్డులకు బదులుగా డిజిటలైజేషన్ బోర్డులను అందించడంతో వాటి ద్వారా విద్యార్థులు పాఠాలు వింటున్నారు. ఇలాంటి వాటికి తప్పనిసరిగా విద్యుత్ అవసరం ఉంటుంది.

• నిర్వహణకు ఇబ్బందులు

పాఠశాలలకు అందించే విద్యుత్ కేటగిరి 7 కింద చార్జీలు వసూలు చేస్తున్నారు. దాని ప్రకారం యూనిట్‌కు రూ.7.80 పడుతుంది. ఆరు గదులున్న ప్రాథమిక పాఠశాలలకు నెలకు సుమారు రూ.600పైబడి బిల్లు చెల్లించాల్సి వస్తుంది. అదే హైస్కూళ్లకు నెలకు రూ.1,500 వరకు బిల్లులు వస్తున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ లెక్కన సంవత్సరానికి సగటున రూ.18 వేల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. వరంగల్ జిల్లాలో 706 పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల నిర్వహణ కోసం విడుదల అయ్యే బిల్లుల్లో సగం విద్యుత్ బిల్లుల చెల్లింపులకు పోవడంతో ఇతర అవసరాలకు సరిపోవడం లేదని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తే స్కూళ్ల అభివృద్ధికి మరింత తోడ్పాటుగా ఉంటుందని పలువురు విద్యావేత్తలు సూచిస్తున్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



ఓదిరెడ్డి (ఫైల్)

చెన్నారావుపేట, జనవరి 21 : మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకొంది. ఇదే గ్రామానికి చెందిన వృద్ధుడు ఎనగందుల ఓదిరెడ్డి (110) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఇంటి వద్ద మృతి చెందాడు. మృతుడికి భార్య శాంతమ్మ, ఇద్దరు కుమారులు, ముగ్గురు మనుసులు, ముగ్గురు మనవరాళ్లు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వర్ధన్నపేట, జనవరి 21 : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంటే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ఆరు నెలల్లో ప్రజలు ప్రభుత్వంపై తిరగబడతారని మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మార్నేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం వర్ధన్నపేటలో ఆయన విలేఖర్లతో మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉండి కూడా ప్రజలను పట్టించుకోకుండా, ప్రజల చేతుల్లో చిత్తుగా ఓడిపోయిన బీఆర్ఎస్ నాయకులు అధికారం లేకపోవడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు ఎవరిపై తిరగబడతారో పార్లమెంట్ ఎన్నికల్లో తేలిపోతుందని తెలిపారు.

కొనసాగుతున్న ఇసుక తవ్వకాలు

వర్ధన్నపేట రూరల్, జనవరి 21 : అక్రమంగా ఇసుకను తోడుతున్న రెండు జేసీబీలను పోలీసులు సీజ్‌చేసి పట్టుకున్నప్పటికీ అవేమి పట్టనట్లు అక్రమార్కులు ఆదివారం సైతం మండలంలోని ల్యాబర్తి ఆకేరు వాగు శివారు మరో జేసీబీతో ఇసుకను తోడుతున్నారు. దీంతో అధికారులు కేసులు పెట్టిన అక్రమార్కుల ఆగడాలు నిలవడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. వందలాది ట్రాక్టర్ల ద్వారా మట్టిని తీసి ఇసుకగా తయారు చేసి తరలించడం పట్ల పోలీసులు కాక, మిగతా అధికారుల పై విమర్శలు వినిపిస్తున్నారు. రెవెన్యూ మైనింగ్ అధికారులు సైతం నిద్రమత్తు వీడి ఇసుక అక్రమ తవ్వకాల పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దొంతి

ఖానాపురం, జనవరి 21: మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన గాడుదుల ఎల్లమ్మ (70) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, ఆదివారం నిర్వహించిన ఎల్లమ్మ దశదినకర్మలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొని ఎల్లమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, వేములపల్లి వెంకటప్రసాదరావు, ఎంపీటీసీ పూల్‌సింగ్, గుగులోతు కిషన్, శాఖమూరి ముఖేశ్, దేవినేని వేణుగోపాల్ రావు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతకు బహుమతి ప్రదానం



ప్రథమ బహుమతి ట్రోఫీని అందిస్తున్న తహసీల్దార్

పర్వతగిరి, జనవరి 21 : మండలంలోని చింత నెక్కొండ గ్రామంలో లయన్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో కుడికాల మల్లేశం మెమోరియల్ ధాత్రి ఫౌండేషన్ నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు ఆదివారం తహసీల్దార్ వెంకటస్వామి, ఎస్సై వీరభద్రరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేఆర్. దిలీప్‌రాజ్, కుడికాల శ్రీనివాస్‌లు బహుమతులను అందించారు. ప్రథమ బహుమతి సాధించిన రాయల్ కింగ్స్ జట్టుకు ట్రోఫీని అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గటికె సుష్మమహేష్, ఉప సర్పంచ్ ధర్మోజు దేవేందర్, ఎంపీటీసీ ముద్రబోయిన సుభాషిణివాసు, హితకారిణి సేవా సంఘం అధ్యక్షుడు గటిక మల్లయ్య, లయన్ స్టార్ యూత్ కమిటీ ఆర్గనైజర్ మామిండ్ల రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



దివ్య

నల్లబెల్లి, జనవరి 21 : ఓ వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని రామతీర్థం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. రామతీర్థం గ్రామానికి చెందిన 29 ఏళ్ల దివ్యకు ఇదే గ్రామానికి చెందిన బొనగాని రామన్నతో కొన్ని సంవత్సరాల క్రితం వివాహమైంది. తరుచుగా కుటుంబంలో గొడవలు జరుగుతుండడంతో తన తల్లిగారింటి వద్దే ఉంటోంది. కానీ, రెండు రోజుల నుంచి తన కుమార్తె కనబడడంలేదని, గ్రామంలో వెతికినా, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఎక్కడ ఆచూకి లభించలేదని దివ్య తల్లి మేరుగు రాజమ్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నైనాల నగేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నల్లబెల్లి, జనవరి 21 : మండలంలోని రుద్రగూడెంలో ఆదివారం రాత్రి ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం. నారక్కపేటకు చెందిన ఓ వ్యక్తి నల్లబెల్లి వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో, రుద్రగూడెం పెద్ద తండాకు చెందిన అజ్మీర రవి గ్రామంలోని ఓ షాపు నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికివెళ్తున్న తరుణంలో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో అజ్మీర రవికి కాలు విరగడంతోపాటు చేతి వేలు కూడా తెగిపడింది. వెంటనే రవిని అంబులెన్స్‌లో దవాఖానాకు తరలించారు.

యోగ ఉచిత శిక్షణ ప్రారంభం

చెన్నారావుపేట, జనవరి 21 : మండల కేంద్రంలోని జాగృతి ఉన్నత పాఠశాలలో యోగా శిక్షణ తరగతులను స్థానిక యోగా గురువు ముల్క ఐలయ్య ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. యోగా శిక్షణ గురువు సదనందం బాపూజీ మాట్లాడుతూ యోగ తరగతులను 21రోజుల పాటు ప్రతీ రోజు ఉదయం 4.30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. చేడు వ్యసనాలను దూరం చేయడానికి యోగా ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఆసక్తిగల ప్రతీ ఒక్కరూ ఉచిత యోగా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హంస విజయరామరాజు, అల్వాల శ్రీను. ఈగ సత్యనారయణ, పడిదం శోభన్‌బాబు, ననుమాస కర్ణాకర్ గౌడ్. రామ్‌మోహన్ చారి, చేరాలు పాల్గొన్నారు.